
MRR 69 TV
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక
ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 347 | గురువారం 6 నవంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-




# చిన్న నిర్లక్ష్యం కూడా వద్దు

- ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలని సూచన
- పార్టీ నేతలు కలిసికట్టుగా పనిచేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- పార్టీ ముఖ్య నాయకులకు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ఉప ఎన్నికల్లో చిన్నపాటి నిర్లక్ష్యం లేకుండా కలిసికట్టుగా పని చేయాలని సూచన
- మంత్రులందరికీ బాధ్యతలు అప్పగించిన




**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా లేకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించారు. జూబ్లీహిల్స్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, అందుబాటులో ఉన్న మంత్రులు పాల్గొన్నారు. ఇప్పటికే మంత్రులు, సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా గత నెల 31, ఈ నెల 1, 4, 5 తేదీల్లో నియోజక వర్గంలోని పలు డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించడంతో పాటు కార్నర్ సమావేశాలు నిర్వహించారు. - మిగతా3లో

# టెక్నాలజీ వాడితే ప్రమాదాలు అరికట్టవచ్చు

- వరుస ప్రమాదాలపై సీఎం చంద్రబాబు ఆవేదన..
- వ్యవస్థాగత లోపాలపై కీలక వ్యాఖ్యలు
- కొన్ని రాష్ట్రాల నామమాత్రపు రిజిస్ట్రేషన్లతోనే అసలు సమస్య అన్న సీఎం
- కాశీబుగ్గ ఘటన క్రౌడ్ మేనేజ్‌మెంట్ వైఫల్యమేనని స్పష్టీకరణ
- ప్రమాదాల నివారణకు పటిష్ఠ రెగ్యులేటరీ అథారిటీ అవసరమన్న ముఖ్యమంత్రి
- ప్రజల భద్రత కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం




**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన వరుస ఘోర ప్రమాదాలపై ఏపీ చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు, చేవెళ్ల బస్సు ప్రమాదాలు, కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట ఘటనలు అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కేవలం విచారం వ్యక్తం చేయడమే కాకుండా ఈ ప్రమాదాల వెనుక ఉన్న వ్యవస్థాగత లోపాలు, పాలసీపరమైన సమస్యలను ఆయన ప్రస్తావించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా టెక్నాలజీని వాడుకోవాలని, పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కర్నూలు బస్సు ప్రమాదంపై స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో ఉన్న సంక్లిష్టతలను ముఖ్యమంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ పర్మిట్లు ఇస్తున్నప్పటికీ, కొన్ని రాష్ట్రాలు నామమాత్రపు ఫీజులతో - మిగతా3లో

# ప్రపంచంతో పోటీ పడాలి

- చంద్రబాబు మంచి చేయకపోగా.. చెడు చేస్తున్నారు
- సమాజంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకం
- రాజకీయాల్లో తులసి మొక్కల్లా ఎదగాలి
- 'కల్మషం లేని రాజకీయ వ్యవస్థ మీ దగ్గర నుంచే ప్రారంభం అవుతుంది
- మంచి రాజకీయాలకు బీజం విద్యార్థి దశలోనే పడుతుంది
- ఒక్క రాత్రిలోనే ఇవన్నీ జరగవు. ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి తాడేపల్లి**

గూగుల్ విషయంలో చంద్రబాబు క్రెడిట్ చోరీ చేశాడని ఆరోపించారు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. మెడికల్ కాలేజీల విషయంలో చంద్రబాబు మంచి చేయకపోగా.. చెడు చేస్తున్నారని అన్నారు. అలాగే, సమాజంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని గుర్తు చేశారు. రాజకీయాల్లో తులసి మొక్కల్లా ఎదగాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గురువారం పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలపై వైఎస్ జగన్ చర్చించారు. అనంతరం వారితో వైఎస్ జగన్ మాట్లాడుతూ.. 'కల్మషం లేని రాజకీయ వ్యవస్థ మీ దగ్గర నుంచే ప్రారంభం అవుతుంది. మంచి రాజకీయాలకు బీజం విద్యార్థి దశలోనే పడుతుంది. మీరంతా జెన్ -తరంలో ఉన్నారు. భావి తరానికి మీరంతా దిక్సూచీ. రాజకీయాల్లో తులసి మొక్కల్లా ఎదగాలి. పలానా వాడు మన రాజకీయ నాయకుడు అని కాలర్ ఎగరేసేకునేలా మనం ఉండాలి. మనలో ఆ గుణాలను, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలి. ఈ రాష్ట్రం మనది కాబట్టి.. ఈ రాష్ట్రం బాగుండాలని మనమంతా కోరుకుంటున్నాం. ఉద్యోగాలు సంపాదించుకునే పరిస్థితిలోకి ప్రతి విద్యార్థీ వెళ్లాల్సిన అవసరం ఉంది. కాని, ఆ పరిస్థితులు ఇప్పుడు ఉన్నాయా? ఒక్క రాత్రిలోనే - మిగతా3లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఒకే రైల్వే ట్రాక్‌పై మూడు రైళ్లు!

బిలాస్‌పూర్‌లో ఒకే ట్రాక్‌పైకి వచ్చిన రైళ్లు.. ఒక ప్యాసింజర్ రైలు, రెండు గూడ్స్ రైలు

అప్రమత్తమై ఆపేసిన ప్యాసింజర్ రైలు లోకోపైలట్

# 21నభారత రాష్ట్రపతి తిరుమల పర్యటన

ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో సమీక్ష

**అంకుశం న్యూస్ తిరుపతి నవంబర్ 6**



భారత దేశ గౌరవ రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము నవంబరు 21వ తేదీన తిరుమలలోని శ్రీవెంకటేశ్వర స్వామివారిని దర్శించుకోనున్నారు. తమ రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ముందుగా నవంబరు 20న తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకుని అనంతరం తిరుమలకు చేరుకుంటారు. ఆలయ సంప్రదాయం ప్రకారం నవంబరు 21న రాష్ట్రపతి ముందుగా శ్రీ వరాహస్వామి ఆలయాన్ని, తరువాత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటన నిమిత్తం కావాల్సిన అన్ని ఏర్పాట్లపై గురువారం తిరుమలలోని శ్రీ పద్మావతి విశ్రాంతి భవనం సమావేశ మందిరంలో టిటిడి అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయనతో పాటు సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు. రాష్ట్రపతి రెండు రోజుల పర్యటనను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపం లేకుండా, పూర్తిస్థాయిలో, సమగ్ర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు ఈవో సూచించారు. ఈ సమావేశంలో ఎస్వీబీసీ సీఈఓ ఫణికుమార్ నాయుడు, సిఈ సత్యనారాయణ, అదనపు ఎస్పీ రామకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉల్లి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- కేవలం మార్కెట్ జోక్యం ద్వారా ఉల్లి కొనుగోలు ఒక్కటే రైతుల్ని ఆదుకోలేదని హెక్టార్ కి 50000 ప్రకటించారు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

రాష్ట్రంలోని ఉల్లి రైతులు ఆధైర్యపడాల్సిన అవసరం లేదని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం పక్కా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఉల్లి ధరలు పతనమైనప్పుడు రైతులు పడిన శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ద్వారా ఉల్లిని కొనుగోలు చేసింది. రాష్ట్రంలోని ఉల్లి రైతులు ఏ విధంగానూ నష్టపోకుండా రక్షించాలనే భావనతో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారని, ఒక క్వింటాకు ?1200 పెట్టి మార్కెటింగ్ శాఖ మరియు మార్క్‌ఫెడ్ ద్వారా కర్నూలు మార్కెట్‌లో సుమారు 18 కోట్ల విలువ గల ఉల్లిని ప్రభుత్వం సేకరించిందని, ఇప్పటికే 10 కోట్ల నగదును రైతుల ఖాతాలలో జమ చేసామని, మిగిలిన 8 కోట్లను అతి త్వరలోనే రైతులకు అందచేయనున్నట్లు మంత్రి తెలిపారు. కేవలం మార్కెట్ - మిగతా3లో

# ప్రపంచంతో పోటీ పడాలి..

-మొదటిపేజీ తరువాయి

ఇవన్నీ జరగవు. ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి. ఒక నాయకుడు తన విజన్‌లో భాగంగా ఒక అడుగు వేస్తే, అవి ఫలితాలు ఇవ్వడానికి 10-15 సంవత్సరాలు పడుతుంది. అలాంటి ఆలోచనలు మనం చేయాలి. అది రియాల్టీలోకి వచ్చినప్పుడు భవిష్యత్తు తరాలు మారుతాయి. సమాజంలో విద్యార్థులుగా మీ పాత్ర అత్యంత కీలకం. మన ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థలో గొప్ప మార్పులు తీసుకు వచ్చాం. కేజీ నుంచి పీజీ వరకూ మంచి చదువులు ఉండాలని భావించాం. పోటీ ప్రపంచంలో విజయాలు సాధించేలా మన ప్రభుత్వంలో ఆలోచనలు చేశాం. స్కూలుకు వెళ్లే పిల్లలకు ఓట్లు లేవని, ఏ రాజకీయ పార్టీ కూడా వారి గురించి పట్టించుకోదు. కాని, రేపు భవిష్యత్తును నిర్దేశించేది వాళ్లే. అందుకని స్కూళ్ల నుంచే మనం విప్లవాత్మక చర్యలు తీసుకు వచ్చాం. ప్రైవేటు స్కూల్స్‌తో పోటీపడేలా ప్రభుత్వ స్కూల్‌లను తీర్చిదిద్దాం. సీబీఎస్‌ఈ నుంచి ఐబీ వరకూ ప్రయాణం ప్రారంభించాం. ఆ స్థాయి విద్యను మన పిల్లలకు మనం ఇవ్వాలి.

**6,200 కోట్లు బకాయిలు..**

మనకు పోటీ ఇతర రాష్ట్రాలతో కాదు, మన పోటీ ప్రపంచంతోనే. ఎడెక్స్‌తో ఉచితంగా ఆన్‌లైన్ కోర్సులు ఇప్పించాం. ప్రపంచంలో అత్యుత్తమ యూనివర్శిటీలకు చెందిన కోర్సులు అందుబాటులోకి ఇచ్చాం. ఆయా యూనివర్శిటీలు సర్టిఫికెట్లు ఇచ్చేలా చేశాం. డిగ్రీల్లో కొత్త కోర్సులు తీసుకు వచ్చాం. మనం రాక ముందు 257 కాలేజీలకు మాత్రమే నాక్ రిజిస్ట్రేషన్ ఉంటే 2024 నాటికి 432కి పెరిగాయి. పూర్తి ఫీజు రియింబర్స్‌మెంట్ తీసుకు వచ్చింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే. కేవలం విద్యాదీవెన అనే ఒకే ఒక పథకం కింద రూ.12,609 కోట్లు ఇచ్చాం. వసతి దీవెన కింద ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.20వేలు ఇచ్చాం. చదువుల కోసం అప్పులు పాలు కాకుండా చూశాం. కాని, ఇవాళ అన్నింటినీ ధ్వంసం చేస్తున్నారు. పిల్లలు చదవకూడదు అనే ఉద్దేశంతో చంద్రబాబు పనిచేస్తున్నారు. ఏడు త్రైమాసకాల నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టారు. ఫీజు రియిబంర్స్‌మెంట్‌లో రూ.4,200 కోట్లు పెండింగ్ ఉంది. వసతి దీవెన కింద రూ.2,200 కోట్లు పెండింగ్. మొత్తంగా రూ.6,200 కోట్లు బకాయి పెట్టారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాయకత్వం తీసుకోవాలి.

**1.2 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం..**

మన ప్రభుత్వ హయాంలో అక్షరాల ప్రభుత్వ రంగంలోనే 6.3 లక్షల ఉద్యోగాలు ఇవ్వగలిగాం. గ్రామ, వార్డు సచివాలయాల్లో



1.2 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. 52 వేల మందిని ఆర్టీసీలో రెగ్యులరైజ్ చేశాం. హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో కూడా భారీగా ఉద్యోగాలు ఇచ్చాం. ఇప్పుడు ఉద్యోగాలను కోత కోస్తున్నారు. ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో 4.7లక్షల యూనిట్ల ద్వారా 33లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోడుగా ఉందనే భావన ఎంఎస్ఎంఈలకు ఉండేది. క్రమం తప్పకుండా వారికి ప్రోత్సాహకాలు అందేవి. అందుకనే పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు వచ్చాయి.

**చంద్రబాబు చేసిందేంటి?.**

గూగుల్ విషయంలో చంద్రబాబు క్రెడిట్ చోరీ చేశాడు. అసలు చంద్రబాబు చేసింది ఏముంది?. సింగపూర్ నుంచి కేబుల్ తీసుకురావడానికి అంకురార్పణ చేసింది వైఎస్సార్‌సీపీ. అదానీ-గూగుల్‌కు 2022లో నోయిడా డేటా సెంటర్ అగ్రిమెంట్ ఉంది. మనం ఇక్కడ కూడా భూములు ఇచ్చాం, అన్ని ఏర్పాట్లూ జరిగాయి. ఆరోజు అడుగులు వేశాం కాబట్టి ఇప్పుడు గూగుల్ వస్తోంది. మూలపేట ప్రారంభించి మనం కట్టుకుంటూ వెళ్లాం కాబట్టి ఇప్పుడు మూలపేట పోర్టు జరుగుతోంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అన్ని అనుమతులు తీసుకొచ్చి మనం శరవేగంగా నిర్మాణాలు చేశాం.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చంద్రబాబు చేస్తున్న అత్యంత దరిద్రపు పని. మంచి చేయకపోగా, చెడు చేస్తున్నాడు. 2019 వరకూ ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలు 12. అప్పటికి చంద్రబాబు ఒక్కటి కూడా తేలేదు. ఐదేళ్లలో కోవిడ్ రెండేళ్లు తీసేస్తే, మూడేళ్లలో 17 మెడికల్ కాలేజీలు తీసుకు వచ్చాం. ప్రతి జిల్లాకో గవర్నమెంటు మెడికల్ కాలేజీ తీసుకు వచ్చాం. 17 కొత్త మెడికల్ కాలేజీల వల్ల 2,550 సీట్లు అందుబాటులోకి వస్తాయి. సగం సీట్లు ఉచితం, మిగిలిన సీట్లు తక్కువ రేటుకే అందుబాటులోకి వస్తాయి. మన పిల్లలు ఇక్కడే డాక్టర్లు అయ్యే అవకాశం ఉంటుంది. మెడికల్ కాలేజీలు సీట్లు ప్రారంభం అయ్యాయి. పాడేరు కూడా ఎన్నికల తర్వాత ప్రారంభం అయ్యింది. 800 సీట్లు అందుబాటులోకి వచ్చాయి.

**సీట్లు వద్దని లేఖ రాసిన వ్యక్తి చంద్రబాబు..**

పులివెందుల కాలేజీకి 50 సీట్లు కేంద్రం ఇస్తే.. వద్దంటూ చంద్రబాబు లెటర్ రాశాడు. మిగిలిన 10 కాలేజీలకు రూ.5వేల కోట్లు పెడితే చాలు. ఏడాదికి రూ.వేయి కోట్లు పెట్టినా చాలు. కాని, చంద్రబాబుకు మనసు రాదు. ఆయన పెట్టకపోయినా పర్వాలేదు, అలా వదిలేస్తే మేం వచ్చాక కట్టుకుంటాం. స్కాములు చేస్తూ అమ్మేస్తున్నాడు. ఇలాంటి వాటిపై ప్రశ్నలు వేసి, నిలదీసే బాధ్యత మీది. రాష్ట్రంలో కోటి సంతకాల కార్యక్రమం జరుగుతోంది. మీరంతా చురుగ్గా పాల్గొనాలి. గ్రామస్థాయిలో కూడా విద్యార్థి విభాగం, యూత్ విభాగం రావాలి. మీ చేతుల్లోనే భవిష్యత్తు ఉంది. మీరు ఎవర్ని డిసైడ్ చేస్తే.. ఆ ప్రభుత్వం వస్తుంది. విద్యార్థి, యువకులకు ఉన్న శక్తి అది. తటస్థులను, భావసారూప్యత ఉన్న వ్యక్తులను కూడా కలుపుకోవాలి. అసెంబ్లీ కేంద్రాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీలు 11 నుంచి 12వ తేదీకి మార్పు జరిగింది. డిసెంబర్‌లో ఫీజు రియింబర్స్‌మెంట్‌పై ఆందోళనలు ఉంటాయి. అంతవరకూ చంద్రబాబుకు సమయం ఇద్దాం అని సూచించారు.

## టెక్నాలజీ వాడితే ప్రమాదాలు అరికట్టవచ్చు

-మొదటిపేజీ తరువాయి

వాహన రిజిస్ట్రేషన్లు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. "కర్నూలులో ప్రమాదానికి గురైన బస్సు ఒడిశాలో రిజిస్టర్ అయింది. తెలంగాణ నుంచి ఆపరేట్ చేస్తున్నారు. ప్రమాదం జరిగింది ఏపీలో, బస్సు వెళ్లేది కర్ణాటకకు. కానీ చనిపోయింది తెలుగువారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రమాదాన్ని ఎలా చూడాలి?" అని చంద్రబాబు ప్రశ్నించారు. ఈ తరహా పాలసీ లోపాలపై చర్చించి సరిదిద్దకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.

**కాశీబుగ్గ ఘటనకు అధికారుల వైఫల్యమే కారణం**

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ, ఇది స్పష్టంగా క్రౌడ్ మేనేజ్‌మెంట్ వైఫల్యమేనని అన్నారు. ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేయడంలో స్థానిక అధికారులు విఫలమయ్యారని అభిప్రాయపడ్డారు. "అక్కడి సీఐ, ఎస్పైకి తెలియకుండా ఇంత పెద్ద ఘటన ఎలా జరిగింది? క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో లోపం ఎక్కడ జరిగింది?" అని ఆయన నిలదీశారు. తెలంగాణలోని చేవెళ్ల బస్సు ప్రమాదంలోనూ భారీ ప్రాణనష్టం జరగడంపై విచారం వ్యక్తం చేశారు.

**పటిష్ఠమైన వ్యవస్థ అవసరం** ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం స్పందించడమే కాకుండా, అవి మళ్లీ జరగకుండా చూడటమే ప్రభుత్వాల బాధ్యత అని చంద్రబాబు అన్నారు. ఇందుకోసం పటిష్టమైన రెగ్యులేటరీ అథారిటీ, స్పష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఉండాలని నొక్కిచెప్పారు. ప్రమాదాల్లో ఎక్కువగా నిరుపేదలే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## ఉల్లి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

-మొదటిపేజీ తరువాయి

జోక్యం ద్వారా ఉల్లి కొనుగోలు ఒక్కటే రైతులుని ఆదుకోలేదని సీఎం చంద్రబాబు గ్రహించి గతంలో ఏ ప్రభుత్వం తీసుకోనటువంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని ప్రతి హెక్టారుకు 50 వేలు అందచేయాలని నిర్ణయించారని, దీనితో వేలాది మంది ముఖ్యంగా కర్నూలు ,కడప రైతులు పంట పాడై భారీ నష్టాల బారిన పడకుండా ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకుందని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా, ఉల్లి రైతులకు హెక్టార్‌కు ?50,000 చొప్పున నష్టపరిహారం అందించేందుకు తీసుకున్న నిర్ణయం రైతుకు నిజమైన అండగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో కర్నూలు జిల్లాలో 15232 హెక్టార్లలో, 23316 మంది రైతులకు 76.16 కోట్లు, కడప జిల్లాలో 5681 హెక్టార్లలో, 6400 మంది రైతులకు 28.41 కోట్లు మొత్తంగా 20,913 హెక్టార్లలో, 29,716 మంది రైతులకు ?104.57 కోట్ల రూపాయల లబ్ధి పొందబోతున్నారని, త్వరలోనే డబ్బులను రైతులకు అందచేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యమని, ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉల్లి పంటకు సంబంధించిన సమస్యలను ఆయా జిల్లాలో ప్రత్యేకంగా మానిటర్ చేయడానికి ప్రక్రియ మొదలుపెట్టామని అన్నారు. వాతావరణ మార్పులు, అనుకోని మార్కెట్ పరిస్థితులు వచ్చినా కూడా ప్రభుత్వం రైతు పక్షానే నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఉల్లి రైతులు ధైర్యంగా ఉండాలి. మీ సమస్యలు మా సమస్యలే. పంటకు తగిన రక్షణ, సరైన ధర కల్పించేందుకు ప్రభుత్వం మీతో ఉంది అని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

## అమరావతి చుట్టూ ఓఆర్ఆర్

-మొదటిపేజీ తరువాయి

పూర్తి చేశారు.అమరావతి రాజధాని చుట్టూ 190 కిలోమీటర్ల పొడవుతో అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించాలన్నది ప్రణాళిక. ఈ ప్రాజెక్టు కోసం జాతీయ రహదారుల సంస్థ డిపిఆర్ సిద్ధం చేసింది. ఢిల్లీలోని జాతీయ రహదారుల సమస్త ప్రధాన కార్యాలయానికి పంపింది. దాదాపు 25 వేల కోట్ల రూపాయలతో ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేయాలన్నది ప్రణాళిక. హైదరాబాద్కు మణిహారంగా నిలిచే ఔటర్ రింగ్ రోడ్డు పొడవు 158 కిలోమీటర్లు. అంటే అమరావతి రాజధాని లో 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తే.. అమరావతికి ఇది మణిహారంగా మారనుంది. 140 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ జరగనుంది. ఐదు జిల్లాల్లో జరిగే భూ సేకరణ కోసం ఒక్కో జిల్లాకు ఒక్కో జాయింట్ కలెక్టర్ ను నియమించింది. త్వరలో భూ సమీకరణ ప్రారంభం కానుంది.

# రాజధానికి మీరు సలహాలు ఇవ్వొచ్చు



**విజయవాడ :** ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించాలని కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం హయాంలో అమరావతిలో ఆగిపోయిన పనులను పునరుద్ధరిస్తోంది. మరోవైపు, పూర్తిస్థాయి రాజధాని నిర్మాణం కోసం అవసరమయ్యే నిధుల సేకరణకు ప్రయత్నాలు చేస్తోంది. వివిధ ఆర్థిక సంస్థల నుంచి రూ. 32,500 కోట్ల నిధులు సేకరించేందుకు సిద్ధం అయింది. ఈ నేపథ్యంలో కేవలం అమరావతి మాత్రమే కాకుండా.. ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రణాళికలను రూపొదించడంలో ప్రజలను కూడా భాగస్వాములు కావాలని తాజాగా ప్రభుత్వం పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత 'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంలో మాతో చేరండి అని ప్రజలను ఆహ్వానించింది.'విజన్ 2047' డాక్యుమెంట్‌ను రూపొందించడంపై ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) ఓ ప్రకటన చేసింది. అందులో.. ఏపీసీఆర్డీఏ ప్రపంచ స్థాయి రాజధాని ప్రాంతాన్ని నిర్మించేందుకు 'విజన్ 2047'ను రూపొందిస్తోందని తెలిపింది. విజన్ కార్యచరణలో భాగంగా, ప్రజలు, వివిధ భాగస్వాముల నుండి రాజధాని ప్రాంతీయ అభివృద్ధి సంస్థ పరిధి కోసం ఆలోచనలు, సూచనలు, ప్రాధాన్యతలు, అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపింది. సీఆర్డీఏ ప్రాంతం సుమారు 8600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉందని తెలిపింది. ఇది దేశంలోనే అతిపెద్ద ప్రణాళికా ప్రాంతాలలో ఒకటని వెల్లడించింది. ఈ రాజధాని ప్రాంతంలో.. కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ఏలూరు జిల్లాల్లోని 56 మండలాలను ఉన్నాయని వివరించింది. విజయవాడ, గుంటూరు, అమరావతి, మంగళగిరి? తాడేపల్లి లాంటి నగరాలతో పాటు 900కు పైగా గ్రామాలు రాజధాని పరిధిలో ఉన్నాయని పేర్కొంది.ఈ క్రమంలో ప్రజలు వెల్లడించే అభిప్రాయాలు.. ఏపీసీఆర్డీఏ బృహత్ప్రణాళిక (మాస్టర్ ప్లాన్ ), విజన్‌కు తోడ్పడతాయని సీఆర్డీఏ ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు ఒక గూగుల్ ఫామ్ తయారు చేసింది. ఈ ఫామ్ నింపి సీఆర్డీఏ ప్రాంతం అభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రజలను కోరింది. కాగా, ఈ సర్వేలో భాగస్వాములు కావాలనుకునే వారు సీఆర్డీఏ వెబ్‌సైట్ (ఇ‌తీటజీ.జీజూ.ఐనీల.తిని)లోకి వెళ్లి లింక్‌పై క్లిక్ చేయడం లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చు. గూగుల్ ఫామ్ ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంది. ఇక్కడ అడిగిన ప్రశ్నలకు టిక్ మార్క్ పెట్టి ప్రజలు తమ అభిప్రాయాలు తెలపవచ్చు. అయితే ఆంధ్రప్రదేశ్ వాసులు మాత్రమే కాకుండా.. విదేశాల్లో ఉన్నవారు.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా, ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేయొచ్చు.

2028 నాటికి చట్టబద్ధత

రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల కార్యాలయాల నిర్మాణం జరుగుతోంది. బ్యాంకింగ్ రంగ సంస్థల కార్యాలయాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన జరగనుంది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ జరుగుతోంది. అయితే గత అనుభవాల దృష్ట్యా అమరావతిని చట్టబద్ధత చేయాల్సిన అవసరం ఉంది. సిఆర్డిఏ చెబుతున్నట్టు ఐదు జిల్లాల పరిధిలో దాదాపు తొమ్మిది వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న అమరావతికి పార్లమెంట్ ఆమోదముద్ర తక్షణ అవసరం. గత అనుభవాల దృష్ట్యా ఇది కీలకం కూడా. చట్టబద్ధత కల్పిస్తే.. అమరావతి అనే దానిని కదిలించలేరు కూడా. అయితే 2029 ఎన్నికల నాటికి అమరావతిని ఒక రూపానికి తెచ్చి ప్రజలకు ఓటు అడగాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అంటే కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేసి చట్టబద్ధత కల్పిస్తుందన్నమాట. అమరావతి రాజధాని లో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. అయితే గ్రేటర్ హైదరాబాద్ మాదిరిగా అమరావతిని నిర్మించి ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావాలన్నది ఆరాటంగా తెలుస్తోంది. అయితే 2014లో అందరి ఆమోదముద్రతో అమరావతి రాజధానిని ఎంపిక చేశారు చంద్రబాబు. పనులు కూడా ప్రారంభించారు. కానీ 2019లో అధికారం మారిపోయేసరికి మూడు రాజధానులు అంశం తెరపైకి వచ్చింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి రాజధాని నిర్మాణాన్ని నిర్వీర్యం చేసింది. దాని పర్యవసానాలు అందరికీ తెలిసిన విషయమే. భూములు ఇచ్చిన రైతులు రోడ్డెక్కారు. వారి పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. అయితే వారి ప్రార్థనలు ఫలించి టిడిపి కూటమి వచ్చింది. లేకుంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో కూడా ఊహించలేం. వైసీపీ అధికారంలోకి వచ్చి ఉంటే అమరావతి అనేది పూర్తిగా నిర్వీర్యం అయిపోయేది. గత అనుభవాల దృష్ట్యా అమరావతి రాజధాని నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉంది కూటమి ప్రభుత్వం. అదే సమయంలో అమరావతిని కదిలించలేని స్థితిలోకి చేర్చాలని ఒక పట్టుదలతో ఉంది. అయితే అది 2028 లోనే చేయాలన్న తలంపుతో ఉంది. ఎందుకంటే ఆ సమయానికి అమరావతి రాజధాని నిర్మాణం ఒక కొలిక్కి వస్తుంది. అమరావతికి ఒక రూపు తెచ్చి.. పార్లమెంటులో బిల్లు పెట్టాలని చూస్తోంది టిడిపి కూటమి ప్రభుత్వం. అలా ఆ బిల్లును ఆమోదించి.. అమరావతిని శక్తివంతమైన నగరంగా మార్చాలన్నది చంద్రబాబు ప్రణాళిక. తద్వారా ప్రజలకు గట్టి సంకేతాలు పంపించనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా డ్యామేజ్ చేయనున్నారు. అసలు అమరావతి విషయంలో స్టాండ్ ఏంటి అని వైసిపి చెప్పుకోలేని స్థితికి తేనున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఏకపక్ష మద్దతు.. పార్లమెంటులో అమరావతి బిల్లు ప్రవేశ పెడితే ఏకపక్షంగా ఆమోద ముద్ర వేసే అవకాశం ఉంది. ఎందుకంటే అమరావతి రాజధానికి అన్ని పార్టీల మద్దతు ఉంది. ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్ప. అయితే ఆ పార్టీ జాతీయస్థాయిలో ఏ కూటమితో కూడా లేదు. తెలుగుదేశం, జనసేన ఎన్డీఏ కూటమిలో ఉంది. ఇండియా కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహిస్తోంది. వామపక్షాలు సైతం అదే కూటమిలో ఉన్నాయి. కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు సైతం అమరావతి రాజధానికి జై కొట్టాయి. దీంతో బిల్లు ప్రవేశపెట్టడమే తరువాయి చాలా సులువుగా ఆమోదముద్ర వస్తుంది. చంద్రబాబులో కూడా అదే ధీమా. ఇప్పుడు గాని చట్టబద్ధత కల్పిస్తే రాజకీయంగా ఎటువంటి ప్రయోజనం ఉండదు. 2028 నాటికి అమరావతికి ఒక తుది రూపు తెచ్చి.. పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలన్న ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## రాజకీయాలకు పురందరేశ్వరి గుడ్ బై



**రాజమండ్రి :** రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు పురంద్రీశ్వరి సంచలన నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. రాజకీయాల నుంచి వైదొలగాలని భావిస్తున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుమారుడు హితేశ్ చెంచురామ్ వచ్చే ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యుల నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ లభించినట్లు ప్రచారం జరుగుతుంది. ఇటీవల కాలంలో నారా చంద్రబాబు నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబాల మధ్య సయోధ్య నెలకొనడంతో వచ్చే ఎన్నికల్లో ఆయనను పోటీకి దింపాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇప్పటికే దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాజకీయాల నుంచి రిటైర్ అయ్యారు. ఆయన పుస్తకాలు రాసుకుంటూ, మనవళ్లతో గడుపుతూ కాలక్షేపం చేస్తున్నారు. రాజకీయాల్లోకి తన కుమారుడు హితేశ్ చెంచురామ్ ను ఎప్పటి నుంచో రాజకీయాల్లోకి తీసుకురావాలని భావించినా కొన్ని అడ్డంకుల కారణంగా అది సాధ్యం కాలేదు.. ఇప్పుడు దగ్గుబాటి పురంద్రీశ్వరి రాజకీయాల్లో ఉన్నారు. ఆమె రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు 1990వ దశకంలో రాష్ట్ర రాజకీయాలను శాసించిన నేత. ఆయన రాజకీయాలకు దూరం కావడంతో పాటు పురంద్రీశ్వరి కూడా అదే నిర్ణయానికి వచ్చేటట్లు కనపడుతుంది. ఆమె కేద్రమంత్రిగా పనిచేశారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యురాలిగా పనిచేశారు. ఆమె కూడా ఇక రాజకీయాల నుంచి రిటైర్ మెంట్ తీసుకుని కుమారుడు హితేశ్ చెంచురామ్ ను రాజకీయాల్లోకి తీసుకు వచ్చి తమ కుటుంబం నుంచి ఒకరు రాజకీయాల్లో కొనసాగేలా చూడాలన్నది కుటుంబ సభ్యుల నిర్ణయంగా కనిపిస్తుంది. అయితే దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ ను ఎక్కడి నుంచి పోటీ చేయించాలన్న దానిపై ఇంకా క్లారిటీ రాలేదంటున్నారు. 2019 ఎన్నికలకు ముందే దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ వైసీపీ లో చేరారు. అయితే నాడు ఆ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆయన విదేశాల్లో ఎక్కువ కాలం ఉన్నందున కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినందున ఆయన స్థానంలో 2019 ఎన్నికల్లో దగ్గుబాటి వెంకటేశ్వరరావు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే నాటి నుంచి ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇక పురంద్రీశ్వరికి కూడా కేంద్ర మంత్రి పదవి రాకపోవడంతో ఇక రాజకీయాలకు స్వస్తి చెప్పాలని భావిస్తున్నారట. అందుకే వచ్చే ఎన్నికల్లో దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ టీడీపీ నుంచి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారని, ఇందుకు చంద్రబాబు కూడా ఓకే చెప్పినట్లు పార్టీ వర్గాల్లో నడుస్తుంది. దగ్గుబాటి హితేశ్ చెంచురామ్ ను పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయట.

## పామూరు సీఐ మాకినేని ని మర్యాదపూర్వకంగా కలిసిన బైరెడ్డి, దారపనేని




**కనిగిరి నవంబర్ 6 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మాకినేని శ్రీనివాసరావును గురువారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి దుశ్యాలవతో సన్మానించి, కనకదుర్గ అమ్మవారి పట్టు వస్త్రాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా వారు సీఐతో పలు విషయాలపై సుధీర్ఘంగా చర్చించారు. పామూరు పట్టణంలో ప్రధాన సమస్య ట్రాఫిక్ ను నియంత్రించాలని, హైవేపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేయాలని, సర్కిల్ ఇన్స్పెక్టర్ మాకినేని శ్రీనివాసరావును దారపనేని, బైరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న ట్రాఫిక్ సమస్యపై పూర్తి సమాచారాన్ని సేకరించి త్వరలో ట్రాఫిక్ సమస్యను నియంత్రిస్తానని హామీ ఇచ్చారు. సీఐ ని సన్మానించిన వారిలో మోపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు యరశింగు రాయుడు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ రమేష్ బాబుకు మాతృవియోగం

– నిమ్మరాజు పరామర్శ



**అంకుశం న్యూస్ గుంటూరు, నవంబర్ 6:** గుంటూరు జిల్లా లోపెదనందిపాడు కేంద్రంగా విశాలాంధ్ర దినపత్రికకు సుదీర్ఘకాలం విలేకరిగా పనిచేసిన ముసునూరు రమేష్ బాబుకు మాతృవియోగం సంభవించింది. గుంటూరులోని స్వగృహంలో భరతమాత సుశీల (93) బుధవారం ఉదయం కన్నుమూయగా, సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. రమేష్ బాబు తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు వీర రాఘవయ్య (99) సరిగ్గా 6 నెలల క్రితమే పరమపదించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా రైతు సంఘం కార్యదర్శిగా పనిచేసిన రమేష్ బాబు, ప్రస్తుతం సత్తెనపల్లి నియోజకవర్గానికి సిపిఐ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. వీరి కుటుంబానికి సన్నిహితుడైన సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు గురువారం వారి నివాస గృహానికి వెళ్లి, ఆరు మాసాల్లోనే తల్లిదండ్రులను కోల్పోయి విషాదంలో వున్న రమేష్ బాబును పరామర్శించి, ఓదార్చారు.

## టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

– పార్టీలో తాజా పరిస్థితుల్ని వివరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి



**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 6:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెళ్లారు. అధ్యక్షుడు పల్లాతో భేటి అయి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితుల గురించి చర్చించారు. ఈనెల 15లోగా పార్టీ కమిటీలు పూర్తి చేయాలన్న ఆదేశాలు ఉన్న నేపథ్యంలో పలు అంశాల గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి చర్చించారు. అర్బన్ నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న నాయకుల గురించి వివరించారు. ఇప్పటికే పలువురు నుంచి అందిన విజ్ఞప్తులను పరిశీలించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు. మరో నాలుగైదు రోజుల్లో పార్టీ కమిటీల పై స్పష్టత వస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ వారికి ఎక్కడా అన్యాయం జరగనివ్వమని ఆయన స్పష్టం చేశారు.

## ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తి కుటుంబానికి ఎమ్మెల్యే చేతులు మీదుగా ఏడు లక్షల అందచేసిన యాజమాన్యం



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 06:** బిక్కవోలు ఎంపీడీఓ కార్యాలయం లో కొప్పవరం గ్రామంలోని సూర్యశ్రీ రైస్ మిల్ లో గతవారం రంగంపేట మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన ప్రమాదవశాత్తు గాయపడి మరణించిన కురుమల్ల వీరబాబు కుటుంబానికి 7,00,000/- రూపాయలు చెక్కును అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు అందచేసిన సూర్యశ్రీ రైస్ మిల్ యాజమాన్యం ఈ కార్యక్రమంలో బిక్కవోలు, రంగంపేట మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ విధానాలపై కాంగ్రెస్ విమర్శ

ధర్మవరం కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేష్



**..అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 6:** కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం విధానాలు ప్రజలకు మేలు చేసేవిగా లేవని ధర్మవరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేష్ విమర్శిస్తూ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జి ఎస్ టి తగ్గింపు అంటూ ప్రకటన చేసారని అయితే వాణిజ్య విపణి లో ఏ ధర తగ్గలేదని ఆయన విమర్శించారు.ప్రజలకు మేలు చేసే విధానాలు అంటూ ఏమీ చేయలేదని విమర్శించారు. అదేవిదంగా అలనాడు స్వా తంత్ర్య పోరాటం లో ఇప్పుడున్న పార్టీ లు ఏమీ లేవని ఒక్క కాంగ్రెస్ పార్టీ నే స్వాతంత్ర్య పోరాటం లో పాల్గొన్న చరిత్ర ఉందన్నారు. మహిళల హక్కులు కోసం పోరాటం సాగించే కాంగ్రెస్ పార్టీ కి రాబోవు కాలంలో చక్కని భవిష్యత్ ఉందన్నారు.రాబోవు కాలంలో ఫెక్ ఓట్లు పై పోరాటం తో బాటు రాహుల్ గాంధీ ఆశయం నిజం చేయడానికి పార్టీ కృషి చేస్తుందని అన్నారు. భారత దేశంలో జాతీయ జెండా ఎగుర వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ కున్నది అన్నారు.ధర్మవరం లో బీజేపీ గెలుపు తో అభివృద్ధి లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఒరేగబెట్టిందేమీ లేదన్నారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మాంటిస్సోరి విద్యార్థి



**రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 6:** అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరి ఎలిట్ కళాశాల ఇంటర్ విద్యార్థి హర్ష అండర్ -19 కేటగిరి జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 8, 9, 10వ తేదీల్లో విజయనగరం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గురువారం మాంటిస్సోరి ఎలిట్ కళాశాల ఎం.డి కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణసమీరా, ప్రిన్సిపాల్ ప్రతాపరెడ్డి, కళాశాల ఇన్చార్జి మధు, దశరథ్ తదితరులు అభినందించారు.

# మా రెవెన్యూ డివిజన్లను యథాతథంగా కొనసాగించండి


- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి
- రెవెన్యూ మంత్రి, కమిషనర్, ఇరు జిల్లాల కలెక్టర్లకు లేఖలు
- నియోజకవర్గ పరిస్థితులను వివరిస్తూ లేఖ రాసిన ఎమ్మెల్యే సునీత



**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 6:** రాప్తాడు నియోజకవర్గ పరిధి లోని రెండు రెవెన్యూ డివిజన్లను యథాతథంగా కొనసాగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, ఒక నియోజకవర్గంలోని మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలన్న దానిపై మంత్రివర్గ ఉపసంఘం, రెవెన్యూ శాఖలు యోచిస్తున్న తరుణంలో ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న మండలాల పరిస్థితుల గురించి వివరిస్తూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ కు లేఖలు రాశారు. రాప్తాడు నియోజకవర్గం భౌగోళికంగా చాలా భిన్నమైన పరిస్థితిలో... ఏర్పడిందని.. ఇక్కడ మొత్తం 6 మండలాలు ఉండగా, జిల్లాల విభజన సమయంలో 3 మండలాలు అనంతపురం జిల్లాలో.. మరో 3 మండలాలు శ్రీ సత్యసాయి జిల్లాలో చేర్చారన్నారు. ఈ క్రమంలో 3 మండలాలు అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో, మరో 3 మండలాలు ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్నాయని వివరించారు. అనగా రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలు అనంతపురం జిల్లాలోని అనంతపురం రెవెన్యూ డివిజన్ లో ఉండగా, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాలు శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంటాయన్నారు. భౌగోళికంగా, ప్రజల అవసరాలు, పరిపాలన సౌలభ్యపరంగా ఇది అందరికి అనుకూలంగా ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ఒక నియోజకవర్గమంతా.. ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉండాలనే నిర్ణయం తీసుకుంటోందని.. అందుకే తమ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాలను ఒక రెవెన్యూ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తే చాలా ఇబ్బందులు తలెత్తుతాయని.. ఉదాహరణకు అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోగల ఆత్మకూరు మండలంలోని కొన్ని గ్రామాల నుంచి వయా అనంతపురం మీదుగా శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వెళ్లాలంటే సుమారు 80 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అలాగే ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోగల రామగిరి మండలంలోని గరిమేకలపల్లి తదితర గ్రామాలు మరియు చెన్నేకొత్తపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి, గంగినేపల్లి తదితర గ్రామాల నుంచి వయా ధర్మవరం మీదుగా అనంతపురం ఆర్డీవో కార్యాలయానికి రావాలంటే సుమారు 80 నుంచి 85 కిలోమీటర్లు వెళ్లాల్సి ఉంటుందన్నారు. రైతులు, ప్రజలు, విద్యార్థుల సౌకర్యం కోసం, అలాగే పరిపాలన సౌలభ్యం కోసం శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని కనగానపల్లి రామగిరి చెన్నేకొత్తపల్లి మండలాలను ప్రస్తుతం ఉన్న విధంగా ధర్మవరం రెవెన్యూ డివిజన్లోనే కొనసాగించాలని అలాగే అనంతపురం జిల్లా పరిధిలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలను ప్రస్తుతం ఉన్న విధంగా అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోనే కొనసాగించాలని ఎమ్మెల్యే సునీత కోరారు...

# అనపర్తి లో అత్యంత వైభవంగా జ్వాలాతోరణం

- గ్రామ పురోహితులు సమక్షంలో శివ పార్వతుల గ్రామోత్సవం
- గ్రామోత్సవంలో పాల్గొన్న అత్యధిక మహిళలు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 06:** అనపర్తి పాతఊరిలో వేంచేసి ఉన్న పురాతన దేవాలయాల్లో ఒకటైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం రాత్రి వైభవంగా జ్వాలాతోరణం నిర్వహించారు. కార్తీక మాసంలో అత్యంత విశిష్టమైన అంశం ఈ జ్వాలాతోరణం ఏ ఇతర మాసంలను ఇటువంటి ఆచారం మనకు కనపడదు. కార్తీక పౌర్ణమి నాడు శివాలయాల ముందు రెండు కర్రలునిలువుగా పాతి ఒక కర్రను వాటికి అడ్డంగా పెడతారు. అడ్డంగా పెట్టిన కర్రకు కొత్త గడ్డిని తీసుకువచ్చి చుడతారు దీనికి యమద్వారం అని పేరు కూడా ఉంది ఈ నిర్మాణంపై నెయ్యి పోసి మంట పెడతారు ఆ మంట కింద నుంచి పరమేశ్వరుని పల్లకిలో అటు ఇటు మూడుసార్లు ఊరేగిస్తారు పండితులు తెలియజేశారు.మన పూర్వీకులు ఈ ఆచారాన్ని ప్రవేశపెట్టడం వెనుక ఒక కారణం ఉంది యమలోకానికి వెళ్లిన వారికి మొదటి దర్శనం ఇచ్చేది అగ్నితోరణం అందుకే కార్తీక పౌర్ణమి రోజున ఎవరైతే యమద్వారం నుంచి మూడుసార్లు అటు ఇటు వెళ్లి వస్తారో వారికి ఈశ్వరుని కటాక్షం లభిస్తుంది వివరించారు. తొలుత పల్లకిలో స్వామివారి విగ్రహాలు విగ్రహాలతో అధిక సంఖ్యలో మహిళలు దీపపు పల్లములు చేతపట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. యువకులుజ్వాలా తోరణం కాలిన గడ్డి గురించి పోటీపడ్డారు ఈ గడ్డి తీసుకుని తమ పంట పొలాల్లో దాన్యం గదుల్లో ఇంటి చోరుల్లో పెట్టుకుంటే మంచి జరుగుతుంది అని నమ్మకంతో గట్టి పోటీ ఇస్తారు గడ్డి గురించి ఈ కార్యక్రమాన్ని ఆర్థిక సంఖ్యలో వీక్షించారు. ఆలయ కమిటీ, పోలీస్ సిబ్బంది సి ఐ సుమంత్, ఎస్సైశ్రీనునాయక్, అడిషనల్ ఎస్సై దుర్గా ప్రసాద్, ట్రైనింగ్ ఎస్సై సుజాత గార్ల పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి వచ్చిన భక్తులు తొక్కిసలాట జరగకుండా చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాళీ రామలింగేశ్వర శర్మ, చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి,చాట్రాతి వీర వెంకట సత్యనారాయణ చౌదరి, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి(బట్టీ శేఖర్), గ్రామ పెద్దలు, గ్రామ పురోహితులు, టిడిపి ముఖ్యనాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(దత్తుడు శ్రీను), కర్రి వెంకటరెడ్డి (వెంకన్న బాబు), తమలంపూడి సత్తి రెడ్డి,చిన్నం వీర్రామారెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

## వివాదాలకు తావులేకుండా డీఎస్సీ నిర్వహణ, ఉద్యోగాలు అందించారు..

- బీసీ సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీపై మక్కువ
- నారా లోకేష్ కళ్యాణదుర్గం పర్యటనకు రావడం చాలా సంతోషం.. సురేంద్రబాబుఎమ్మెల్యే దగ్గుపాటి





**అంకుశం న్యూస్ అనంతపురం నవంబర్ 6:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నారా లోకేష్ ఐటీ, విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యా అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని, ఆయన లక్ష్యం ఒక్కటేనని ప్రభుత్వ పాఠశాలల్లో కూడా సీట్లు లేవని బోర్డులు పెట్టె పరిస్థితి రావాలని ఇప్పటికే మన కళ్యాణదుర్గం కరణం చిక్కప్ప పాఠశాలలో 1500 విద్యార్థులతో సీట్లు లేవని బోర్డు పెట్టారని ఇదే రాష్ట్రమంతా చూడాలని లోకేష్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పేర్కొన్నారు.. కళ్యాణదుర్గం పట్టణంలోని శెట్టూరు రోడ్డులో నారా లోకేష్ బస చేసే స్థలం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పార్టీ పరిశీలకులు నాగేశ్వర్ యాదవ్ తో కలసి పరిశీలించారు.. అనంతరం కనకదాసు సర్కిల్ వద్ద జరుగుతున్న సభా వేదిక ఏర్పాట్లు, విగ్రహావిష్కరణ ప్రాంతం, హైమస్ లైట్లు, జయంతి వేడుకలకు వచ్చే ప్రజల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి రేపటి ఉదయానికి పనులు అన్ని పూర్తి అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు..

## జగన్ మోహన్ రెడ్డిని కలిసిన వైయస్సార్సీపి ఐటీ వింగ్ అధ్యక్షులు




**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 06:** మండపేట నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఐటి వింగ్ అధ్యక్షులుగా ఎంపికైన యరమాటి వెంకన్నబాబు మండపేట నియోజకవర్గం పార్టి ఇంచార్జ్, పిఏసీ కమిటి మెంబర్, రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో కలసి మాజీ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు వైయస్.జగన్ తో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువైనప్పటి నుండి మండపేట నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి, సంక్షేమం కనుచూపుమేర కనపడటం లేదని కాబట్టి ప్రజలకు, కార్యకర్తలకు భరోసాగా నిలబడటం కోసం ఐటి వింగ్ తరుపున ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుతో కలిసి "నాయకుడితోనే న్యాయంచేయిస్తాం" అనే కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నామని వెంకన్నబాబు తెలిపారు. దీనితో పాటు పార్టీ ఆదేశానుసారం అన్యాయానికి గురైన పార్టీ కార్యకర్తలు, ప్రజలకు డిజిటల్ బుక్ ద్వారా మండపేట పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డెస్క్ ను కూడా ఎప్పుడు అందుబాటులో ఉంచామని తెలిపారు. రాబోయేది వైసీపీ పాలనేనని పార్టీ అధ్యక్షులు జగన్ అన్నారని తెలిపారు. శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు నాయకత్వంలో నియోజకవర్గ పార్టీ ప్రతిష్టతకు మరింత కృషి చేసి వచ్చే స్థానిక సంస్థలు పురపాలక సంఘ ఎన్నికలలో గతంలో మాదిరిగానే పార్టీని బారి మెజారిటీతో గెలిపించాలని జగన్ సూచించారని తెలిపారు.

## పేదల సేవలో లో మెహర్ బాబా ప్రేమికుల శాశ్వత వైద్య, శిబిరం ల సేవా సంస్థ !




**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 6:** ధర్మవరం కేశవ నగర్ లో నిరు పేదల కోసం వారికి ప్రతి నిత్యం ఉచిత వైద్య సేవలు అందించడానికి మెహర్ బాబా ప్రేమికుల శాశ్వత వైద్య శిబిరముల సేవా సంస్థ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు గుద్దిటి సోమ్ దాస్ తెలిపారు. ఈ సేవా శిబిరం ఆర్థిక స్తోమత లేనివారికి ఉచితంగా. వైద్య ఆరోగ్య పరీక్షలు చేయడం ప్రతి రోజు ఉదయం 9.నుండి మధ్యాహ్నం 12 వరకూ చేస్తున్నామని అన్నారు.

## చౌడేశ్వరి దేవి ప్రత్యేక అలంకారం!



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 6:** చేనేత ఆరాధ్య దైవం నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి కి గురువారం ప్రత్యేక అలంకరణ చేశారు. కార్తీక మాసం లో కార్తీక దీపాలు ఏర్పాటు చేసారు అమ్మవారికి ప్రత్యేక పట్టు చీర అలంకరించి ప్రత్యేక పూజలు చేసారు. ప్రాచీన కాలం నుండి ఈ ఆలయం బహుళ ప్రసిద్ధి గాంచింది. వారం లో ప్రతి శుక్రవారం, మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారని ధర్మవరం లోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ తరుపున స్థానిక చేనేత ప్రముఖులు దాశెట్టి నారాయణ స్వామి,దాశెట్టి నాగరాజు, మరియూ దాశెట్టి కుటుంబ సభ్యులు తెలిపారు.

## మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోండి.. ఎక్సైజ్ సీఐ చంద్రమణి



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 6:** ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని బత్తలపల్లి మండలంలోని జిఎస్ఐ నెంబర్ ఎస్ ఎస్/ఏ 4 షాపుకు, ముదిగుబ్బ మండలంలోని జి ఎస్ ఐ నెంబర్ ఎస్ ఎస్/18 ఏ 4 మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవాలని ధర్మవరం ఎక్సైజ్ చంద్రమణి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ దరఖాస్తు రుసుము కింద రెండు లక్షల రూపాయలు డిడి తీసి ఆధార్ కార్డు జత చేసి ధర్మవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లో గాని దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 12వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో లక్కీ డ్రా తీయడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి

- ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ అధికారి వివేక్ కుమార్ యాదవ్
- అర్హులైన ప్రతి ఓటరు నమోదు కావాలి :
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..






**అంకుశం ప్రతినిధి అనంతపురము, నవంబర్06:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, ఆంధ్ర ప్రదేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్ (SIR-2025) కార్యక్రమం నిర్వహించబోతున్నదని, ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి అర్హత ఉన్న పౌరుడు ఓటర్ల జాబితాలో నమోదు కావడం, అనర్హులు తొలగింపు చేయటం, జాబితా పారదర్శకంగా ఉండటం లక్ష్యంగా చేపట్టడం జరుగుతుందని ఆం.ప్ర రాష్ట్ర చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ పేర్కొనగా ఓటర్ల జాబితా ప్రీ రివిజన్ / స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం జిల్లాలో పక్కగా పారదర్శకంగా శుద్ధమైన ఎలెక్టోరల్ రోల్ లక్ష్యంగా జరగాలి అని అర్హులైన ప్రతి ఓటరు నమోదు కావాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం సీఈఓ ఏపీ రాష్ట్ర సచివాలయం నుండి వర్చువల్ విధానంలో అందరూ జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులకు దిశా నిర్దేశం చేయగా అనంతపురం జిల్లా ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా రెవెన్యూ అధికారి మలోల, ఎన్నికల సెక్షన్ సిబ్బంది సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (Election Commission of India) ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్స్-2025 (Special Intensive Revision of Electoral Rolls - 2025) కార్యక్రమం ప్రారంభమవుతున్నదనీ, ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతి అర్హత ఉన్న పౌరుడు తన పేరు ఓటర్ల జాబితాలో చేర్చుకునే అవకాశం పొందుతారని అన్నారు

ఈ కార్యక్రమంలో కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యగేశ్వరి దేవి, ఎన్నికల సెక్షన్ డిటి కనక రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనంతలోరెవెన్యూ క్రీడలు నిర్వహణకుసర్వం సిద్ధం

- సుందరంగా ఆర్డిటి స్టేడియం అన్ని ఏర్పాట్లు పూర్తిలి
- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ





**అంకుశం ప్రతినిధి అనంతపురం, నవంబర్ 06 :-** అనంతపురం జిల్లాలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములను నిర్వహించడం జరుగుతోందని, రెవెన్యూ క్రీడల కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములకు సంబంధించిన రిహార్సల్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9 తేదీల్లో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములు నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరుగుతున్నాయన్నారు. ఈ క్రీడల్లో రాష్ట్రస్థాయి రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనడం పట్ల చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందులో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తదితరులు పాల్గొనడం జరుగుతుందన్నారు. అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములు అనంతపురం జిల్లాలో నిర్వహించడం జరుగుతోందని, ఈ క్రీడలను ఇంతకుముందు నిర్వహించిన విధంగానే విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈరోజు రిహార్సల్స్ నిర్వహించామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి రెవెన్యూ క్రీడలు మరియు సాంస్కృతిక ఉత్సవములకు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొనడం జరుగుతోందని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి. రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఆర్డీఓలు కేశవ నాయుడు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, మల్లికార్జున రెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, రమేష్ రెడ్డి, తిప్పేనాయక్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దివాకర్ బాబు, సెక్రటరీ సోమశేఖర్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోషియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సంజీవరెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సత్యసాయి ఏపీఆర్ఎస్ఏ ప్రెసిడెంట్ మధునాయక్, మీడియా ఇంచార్జి మునివేలు, డిఎస్డీఓ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి.

## - పుట్టపర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడి.





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి నవంబర్:06** :గ్రామాల్లో నెలకొన్న ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ అధికారులకు సూచించారు. పుట్టపర్తి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధించి వాటికి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలో చాలామంది రైతులు పంటలు పండించి వాటికి మార్కెట్ సౌకర్యం లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాంటి వారికి మార్కెటింగ్ ,వ్యవసాయ ,ఉద్యానవన ,పట్టు పరిశ్రమ ,వెటర్నరీ ,గ్రామీణ అభివృద్ధి వెలుగు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ఫార్మర్ కమ్యూనిటీ గ్రూప్ ద్వారా పంట ఉత్పత్తులు అమ్మకాలు కొనసాగించే విధానానికి శ్రీకారం చుట్టాలని తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీల్లో రైతులు పండించే పంటల వివరాలు సాగు విస్తీర్ణం ,పంట దిగుబడి వాటి వివరాలను రైతు కేంద్రాల్లో నమోదు చేయాలన్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుందని తెలిపారు. రైతులు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయాన్ని అలవర్చుకొని వాణిజ్య పంటలను సాగు చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులు అధికారులు రైతులతో ప్రత్యేక గ్రూపును ఏర్పాటు చేసి ఇలాంటివి సోషల్ మీడియా ద్వారా పేద తన దృష్టికి తీసుకొస్తే వాటికి తగిన పరిష్కారాన్ని చూపించే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం రైతులకు ఎన్నో మంచి సంక్షేమ పథకాలను రాయితీలను అందిస్తోందని వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి మండల వైస్ ఎంపీపీలు మండల ప్రజా ప్రతినిధులు విజయ్ కుమార్ ,శ్రీరామ్ రెడ్డి ,పుల్లప్ప ,అధికారులు స్థానిక సర్పంచులు శ్రీనివాసులు, ఎంపీటీసీలు మధురిమ , పెద్దన్న ,గ్రామ కార్యదర్శులు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యంతోనే మెరుగైన ఉపాధి

- సిఈఓ ఆవుల చంద్రశేఖర్
- భవిష్యత్తును శాసించేది ఫోటానిక్ లేనని వెల్లడి
- ఎస్ఆర్ఎంలో ఘనంగా ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు





**అంకుశం ప్రతినిధి విజయవాడ, నవంబర్ 6:** నేటి ఆధునిక శాస్త్ర సాంకేతిక యుగంలో నైపుణ్యాలు మెరుగుపరచుకుంటేనే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆవుల చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న తాజా పరిశోధనా ఫలితాలను అధ్యాపకులు, విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. సాంకేతిక విప్లవంతో 5జి, 6జి, కృత్రిమ మేధ, డేటా కేంద్రాలు, అటానమస్ వెహికల్స్, క్వాంటం కంప్యూటింగ్, మెడికల్ ఇమేజింగ్, బయో సెన్సర్స్ వంటివి అందుబాటులోకి వచ్చాయన్నారు. వర్తమానంలో ఎలక్ట్రానిక్స్ ప్రభావం ఉందని, భవిష్యత్తును ఫోటానిక్ లే శాసిస్తాయని అభిప్రాయపడ్డారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆడిటోరియంలో గురువారం ఉదయం ప్రతిష్టాత్మకమైన "రెండో అంతర్జాతీయ సదస్సు ఎపిక్ -2025" ప్రారంభ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సిహెచ్ సతీష్ కుమార్ తొలిరోజు ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథి ఆవుల చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్-ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు (ఎపిక్) అంటే ఎలక్ట్రానిక్ భాగాలను, ఫోటోనిక్ (కాంతి) భాగాలను ఒకే మైక్రోచిప్‌లో ఏకీకృతం చేసే సాంకేతికత అని వివరించారు. ఇవి డేటాను ప్రాసెస్ చేయడానికి ఎలక్ట్రాన్‌లతో పాటు ఫోటాన్‌లను (కాంతి కణాలను) ఉపయోగిస్తాయన్నారు. సాంప్రదాయ ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ల కంటే ఎక్కువ వేగంగా, తక్కువ శక్తితో పనిచేయడానికి సహాయపడతాయన్నారు. ఈ సర్క్యూట్లు వాతావరణం వంటి కఠినమైన పరిస్థితులలో పనిచేయడానికి కూడా రూపొందించబడ్డాయన్నారు. మిశ్రమ సాంకేతికత ముఖ్య లక్షణమన్నారు. ఈ సర్క్యూట్లు ఎలక్ట్రానిక్ (ట్రాన్సిస్టర్‌లు, రెసిస్టర్‌లు), ఫోటోనిక్ (లైట్-ఎమిటింగ్, డిటెక్టింగ్, ట్రాన్స్‌మిటింగ్ భాగాలు) భాగాలను కలిగి ఉంటాయన్నారు. ఫోటాన్‌లు ఎలక్ట్రాన్‌ల కంటే వేగంగా ప్రయాణిస్తాయి, కాబట్టి డేటా ప్రాసెసింగ్ వేగంగా ఉంటుందన్నారు. ఫోటాన్‌లు ప్రయాణించేటప్పుడు ఎటువంటి శక్తిని వినియోగించుకోవని, వేడిని ఉత్పత్తి చేయవని వెల్లడించారు. వీటిని ఎలక్ట్రానిక్, ఫోటానిక్ భాగాలు కలిసే అనేక రంగాలలో ఉపయోగిస్తారని చెప్పారు. ముఖ్యంగా అంతరిక్షంలో కఠినమైన వాతావరణంలో పనిచేసే పరికరాల కోసం వాడతారని ఆవుల చంద్రశేఖర్ వివరించారు. ఈ సందర్భంగా అబ్ స్ట్రాక్ట్ బుక్ ను విడుదల చేశారు. ఉపకులపతి ప్రొఫెసర్ సిహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధన ఫలితాలను, నూతన సాంకేతిక విజ్ఞానాన్ని, సృజనాత్మకతను పంచుకునేందుకే ప్రపంచ స్థాయి వేదికగా ఈ సదస్సు నిలుస్తుందన్నారు. ప్రపంచ ప్రఖ్యాత పరిశోధకులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో చర్చించి మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ సివి టోనీ, కన్వీనర్ డాక్టర్ గౌతమ్ కుమార్ రానా, ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ కె.ఏ. సునీత, తదితరులు పాల్గొన్నారు.

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా -వృత్తి విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

- రూ.20 లక్షలతో పాలిటెక్నిక్ విద్యార్థులకు మిషన్ లు అందజేత
- ఇసుజు కంపెనీ ప్రతినిధులను అభినందించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్







**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 06:** విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణలతోనే ఉన్నతమైన భవిష్యత్తు సాధ్యమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచనలతో ఇసుజు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ శంకర్ శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఓనో సుంగ్ (జపాన్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్)కింద సమకూర్చిన మూడు అధునాతన %దీూ% 6 మిషన్లను బట్లపాలెం, ముక్తేశ్వరం, ద్రాక్షారామం పాలిటెక్నిక్ కళాశాలలకు ముఖ్యఅతిథి వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా గురువారం అందజేశారు. రామచంద్రపురం ఉపాధి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇసుజు ప్రతినిధులు, ఉపాధి కార్యాలయం సీఈఓ రామ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వాసంశెట్టి సత్యం మాట్లాడారు. రామచంద్రపురం నియోజవర్గంలో చదువుకుంటున్న విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ తో పాటు, వారి ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇప్పటివరకు 29 జాబ్ మేళాలు నిర్వహించా మన్నారు. మంత్రి సుభాష్ సూచనలతో ఇసుజు కంపెనీ ప్రతినిధులు అందజేసిన ఈ మిషన్ల ద్వారా స్కిల్ డెవలప్మెంట్ ను మెరుగుపరచుకోవాలని సూచించారు. మంత్రి సుభాష్ మాటను గౌరవించి మిషన్లు అందించిన కంపెనీ ప్రతినిధులను వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ హామీ సూపర్ సిక్స్ లో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు కల్పన దిశగా కృషి జరుగుతుందన్నారు. ఇసుజు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ శంకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా మంత్రి సుభాష్ సూచనల మేరకు ఈ మిషన్లు అందించడం జరిగిందన్నారు. నియోజవర్గ ప్రజలు, యువత పట్ల బాధ్యత కలిగి మంత్రి సుభాష్ చేస్తున్న సేవలు అభినందనీయమని కంపెనీ ప్రతినిధులు ప్రశంసించారు. సమాజ సేవలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ బాసటగా నిలుస్తూ సేవలు అందించడం పట్ల కంపెనీ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కంపెనీలో ఆంధ్రప్రదేశ్ నుంచి 83% మంది ఉద్యోగులు పనిచేయడం విశేషం అన్నారు. ఉద్యోగం, ఉపాధి,నిరుద్యోగ నిర్మూలన, కోసం నిత్యం శ్రమిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి సుభాష్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు,పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, కవల నానాజీ, ఏసుదాస్, పాలిటెక్నిక్ కళాశాలల సిబ్బంది, ఉపాధి కార్యాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధి చేకూర్చాలి

- జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, నవంబరు 6:** జిల్లాలో అర్హత ఉన్న పేదలు ప్రతి ఒక్కరికి ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధి చేకూర్చాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో... జిల్లాలో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (PMUY) క్రింద ఉచిత ఎల్పిజి కనెక్షన్స్ విడుదల కోసము జిల్లా స్థాయి దీపం మరియు ఉజ్వల కమిటీ సమావేశాన్ని జేసీ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ.. అర్హత ఉన్న పేద లబ్దిదారుల కుటుంబానికి సంభందించిన వయోజన మహిళలకు ఉచితముగా ఉజ్వల కనెక్షన్స్ లను కల్పించాలని ఆయిల్ కంపెనీ అధికారులను ఆదేశించారు. అలాగే ఇంకను పెండింగ్ లో ఉన్న పిఎంయువై (PMUY) దరఖాస్తులను విచారణ చేసి త్వరితగతిన కనెక్షన్స్ మంజూరు చేయాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్న 2060 లబ్దిదారులకు వీలైనంత తొందరగా ఉజ్వల కనెక్షన్స్ విడుదల చేయాలనీ IOCL, BPCL మరియు HPCL ఆయిల్ కంపెనీల అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్యాస్ ఏజెన్సీస్ ప్రజల నుండి డెలివరీ చార్జీలు అదికంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కూడా ఆయిల్ కంపెనీలకు సూచించారు. కనెక్షన్ పొందిన తరువాత వలస లబ్దిదారులలో 20% మరియు స్థానిక లబ్దిదారులలో 5% భౌతికంగా తనిఖీ చేయాల్సి ఉంటుందని ఆయిల్ కంపెనీ జిల్లా నోడల్ అధికారి ఎం.ఎ.అసిం జెసికి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాలు అధికారి బి. రాజు, అయిల్ కంపెనీ జిల్లా నోడల్ అధికారి ఎం.ఎ.అసిం, కమిటీ సభ్యులు దంటి హసనాపురం తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ పర్యటనను విజయవంతం చేద్దాం

- రోడ్డు విస్తరణ చేసి సర్కిల్ మరింత అభివృద్ధి చేస్తాం..
- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు
- లోకేష్ పర్యటన ఏర్పాట్లను టీడీపీ నాయకులు, అధికారులతో కలసి పరిశీలించిన ఎమ్మెల్యే



**అంకుశం న్యూస్ కళ్యాణ్ దుర్గం నవంబర్ 6 :** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మంత్రి లోకేష్ పర్యటన అందరం కలిసి విజయవంతం చేద్దామని కలిసికట్టుగా లోకేష్ పర్యటనలో ఎటువంటి లోపాలు లేకుండా పనిచేయాలని కళ్యాణ్ దుర్గం శాసనసభ్యులు సురేంద్రబాబు కార్యకర్తలకు అధికారులకు సూచించారు కళ్యాణదుర్గం పట్టణంలో ప్రతి సర్కిల్ కూడా సర్వాంగ సుందరంగా తయారు చేయాలన్న లక్ష్యంతో రోడ్లకు ఇరువైపులా అక్రమణలను తొలగించి రోడ్ల విస్తరణ చేసి పట్టణ అభివృద్ధి చేసి చూపిస్తామని, ఇందులో ఏ ఒక్కరినో ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశ్యంతో చేయడం లేదని కేవలం అభివృద్దే ప్రధానంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు..రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా భక్త కనకదాసు 538వ జయంతి వేడుకలను, అలాగే కనకదాసు విగ్రహావిష్కరణ, సర్కిల్ కు నామకరణం చేసేందుకు విచ్చేస్తున్న విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గారి పర్యటన కోసం ఇప్పటికే ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని, రోడ్డు కూడా రెండు వైపులా 25 నుంచి 30 మీటర్ల వరకు వెడల్పు చేస్తున్నామని, విద్యుత్ స్థంబాలు మార్పు నేడు పూర్తి అవుతాయాని ఇక పట్టణంలో పలు చోట్ల స్వాగతం ఏర్పాట్లు జరుగుతున్నాయని, అలాగే కనకదాసు సర్కిల్ పక్కనే సభ ఏర్పాటు చేస్తారు కాబట్టి రోడ్డు పూర్తిగా బ్లాక్ అవుతుందని, వాహన రాకపోకలను డైవర్షన్ ఏర్పాటు కూడా చేసినట్లు, రాత్రికి లోకేష్ గారు బస చేసేందుకు కూడా శెట్టూరు రోడ్డులో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు..ప్రజలు కూడా స్వచ్ఛందంగా తరలివచ్చి లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.